క్లుప్తంగా

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు


చంద్రేడు గ్రామంలో చంద్రశేఖరస్వామి

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని సుందరం అలంకరించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదపూడి: సంపర గ్రామంలో ప్రసిద్ధి చెందిన విజయ దుర్గ అమ్మవారికి ఘనంగా పంచామృతాభిషేకం పూజలు చేశారు. శుక్రవారం అమ్మవారికి కంకుమ పూజలు చేశారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో చీరకట్టి భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు భక్తులతో లలితా, విష్ణు సహస్ర పారాయణం చేయించారు.

రామలింగేశ్వరునికి అభిషేకాలు


సీతానగరంలో ఉమా రామలింగేశ్వరస్వామి

సీతానగరం: స్థానిక శివాలయంలో కొలువైన ఉమా రామలింగేశ్వర స్వామికి శుక్రవారం మాసశివ రాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, లక్షపత్రి పూజ నిర్వహించారు. అర్చకులు కొడమంచిలి రాంబాబు స్వామి, కొడమంచిలి మోహన్ శ్యామ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

విజయ దుర్గమ్మకు అభిషేకాలు


రంగంపేటలో కొలువైన విజయదుర్గ అమ్మవారు

రంగంపేట: గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రానైట్ ట్రాలీని ఢీకొన్న లారీ


ప్రమాద స్థలంలో ట్రాలీ, లారీ

రాజానగరం: జాతీయ రహదారిపై స్థానిక ఏడీబీ రోడ్డు జంక్షన్‌లో పెద్ద గ్రానైట్ రాళ్లతో వెళుతున్న ట్రాలీని ఓ లారీ ఢీకొంది. దీంతో రహదారిపై గ్రానైట్ రాళ్ల పడిపోయాయి. గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివర్లాలోకి వెళితే.. రాజమహేంద్రవరం వైపు నుంచి కాకినాడ పోర్టుకు పెద్ద గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న ట్రాలీ శుక్రవారం రాత్రి జంక్షన్‌లో ఏడీబీ రోడ్డుకు మలుపు తిరుగుతోంది. దాన్ని విశాఖపట్నం నుంచి ఇనుప చువ్వల లోడుతో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. లారీ ఢీ కొట్టిన వేగానికి ట్రాలీపై ఉన్న రెండు గ్రానైట్ రాళ్లు రహదారిపై అడ్డదిడ్డంగా పడ్డాయి. దీంతో అటు జాతీయ రహదారి, ఇటు ఏడీబీ రోడ్డు వైపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జంక్షన్‌లో విద్యుత్ దీపాలు లేకపోవడం కూడా ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. దీనితో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం పూర్తి దెబ్బతినడంతో పాటు, దానిలోని డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆటోలో చికిత్స కోసం రాజమహేంద్రవరానికి తరలించారు. ఎస్సై నాగార్జున సంఘటనా స్థలానికి చేరుకుని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు.

గ్యాస్ సర్దుపాట్లు

- కనెక్షన్లను సర్దుబాటు చేస్తున్న కంపెనీలు
- సమాచారం ఇవ్వకుండా నిర్ణయం
- ఏజెన్సీల మార్పుపై వినియోగదారుల ఆవేదన

రాజానగరం: నేటి ఆధునిక సమాజంలో గ్యాస్ కనెక్షన్ లేకుండా వంటావార్పు చేసుకునే పరిస్థితి లేదు. తాటాకిల్లు నుంచి భవనాల్లో ఉండే వారందరూ గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నారు. పూర్వ కాలంలో కట్టెల పొయ్యిలపై వంట చేయడానికి మహిళలు అవస్థలు పడేవారు. వంట గ్యాస్ అందుబాటులోకి రావడంతో రెండు దశాబ్దాలుగా ఆ సమస్య లేదనే చెప్పాలి. అయితే ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ల సర్దుబాటుతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. వీరికి ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా కనెక్షన్‌ను వేరే ఏజెన్సీకి మార్పుచేస్తున్నారు. చేసిన తర్వాత వినియోగదారుడి సెల్‌కు మెసేజ్ పంపుతున్నారు.

పెరిగిన వినియోగం

ప్రభుత్వాలు దీపం పథకం పేరుతో తెల్లరేషన్ కార్డుదారులకు ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం ప్రారంభించారు. దీంతో పదేళ్లుగా గ్యాస్‌తో వంట చేసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. గ్యాస్ ఏజెన్సీల ద్వారా లబ్దిదారులకు సిలిండర్లు వస్తాయి. ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని గ్యాస్ ఏజెన్సీని ఎంచుకుని, దాని ద్వారా సిలిండర్లు పొందుతారు. ప్రస్తుతం వీరి అనుమతి లేకుండానే గ్యాస్ ఏజెన్సీలకు కనెక్షన్లను మార్చివేస్తున్నారు.


వంట గ్యాస్ సిలిండర్లు

అనుమతి అవసరం లేదా!

సాధారణంగా ఏ కంపెనీ అయినా వినియోగదారునికి సౌలభ్యంగా ఉండేలా తమ వ్యాపారాలను విస్తృతం చేస్తాయి. దీపం పథకం ప్రభావంతో ప్రతి గ్రామంలోనూ వంట గ్యాస్ కనెక్షన్లు పెరిగిపోయాయి. ఆయా గ్యాస్ కంపెనీల సామర్థ్యానికి మించి కనెక్షన్లు మంజూరు చేశాయి. ఈ నేపథ్యంలో వినియోగదారుడికి ఏ మాత్రం సమాచారం ఇవ్వకుండా, అతడి అనుమతితో ప్రమేయం లేకుండానే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీలకు ఉన్న కనెక్షన్లను సర్దుబాటు చేస్తున్నాయి. గ్యాస్ కంపెనీలు అవలంబిస్తున్న ఈ చర్యలతో వినియోగదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది.

మండలానికో గ్యాస్ ఏజెన్సీ

వంట గ్యాస్ వినియోగం అంతంత మాత్రంగా ఉన్న రోజులలో రాజమహేంద్రవరం కేంద్రంగానే గ్యాస్ సరఫరా ఏజెన్సీలు ఉండేవి. అయితే గత దశాబ్దంన్నర కాలంగా ప్రభుత్వాలు పేదలకు దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయడం ప్రారంభించడంతో వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారుడికి అందడానికి 10 నుంచి 15 రోజులు, ఒక్కోసారి నెల రోజుల సమయం పట్టేది. దీనితో వినియోగదారుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చేవి. ఈ క్రమంలో ఈ సమస్యను చక్కదిద్దేలా మండలానికో గ్యాస్ ఏజెన్సీని ఏర్పాటు చేసి, అప్పటి వరకు ఉన్న కనెక్షన్లను మండలాల వారీగా ఆయా ఏజెన్సీలకు కేటాయించారు. అప్పటి నుంచి గ్యాస్ ఇబ్బందులు చాలావరకు తీరాయనే చెప్పవచ్చు. అయితే ప్రస్తుతం పూర్వ పరిస్థితులు పునఃరావృత్తం అయ్యేలా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం వివాదానికి కారణమవుతోంది.



ఏజెన్సీ మారినట్టు వినియోగదారుడికి వచ్చిన వాట్సాప్ మెసేజ్

వివాదాస్పదం

ప్రస్తుతం హెచ్‌పీ, ఇండేన్, భారత్ వంటి కంపెనీలు వినియోగదారులకు వంట గ్యాస్‌ను సరఫరా చేస్తున్నాయి. వీటికి సంబంధించి మండలానికో ఏజెన్సీ ఉంది. ఉదాహరణకు రాజానగరం మండలంలోని పాలచర్లలో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఉంటే అనపర్తి నుంచి ఇండెన్, హుకుంపేట నుంచి భారత్ కంపెనీలకు సంబంధించి ఏజెన్సీలు వినియోగదారులకు వంట గ్యాస్‌ని సరఫరా చేస్తున్నాయి. తాజాగా హెచ్‌పీ కంపెనీ కోరుకొండలో ఉన్న తమ ఏజెన్సీకి సంబంధించిన కొన్ని కనెక్షన్లను వినియోగదారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాజమహేంద్రవరంలోని ఏజెన్సీకి బదలాయించడం వివాదాస్పదమైంది. గతంలో రాజమహేంద్రవరంలో ఉన్న తమ కనెక్షన్లను దూరాభారం కావడంతో కోరుకొండకు బదిలీ చేయించుకున్నామని, ఇప్పుడు తమను సంప్రదించకుండా తిరిగి రాజమహేంద్రవరం ఏజెన్సీకి ఎందుకు బదలాయించారని వినియోగదారులు కంపెనీ చర్యలను తప్పు పడుతున్నారు. ఇదే విధంగా మిగిలిన కంపెనీలు కూడా వ్యవహరించే అవకాశం ఉండటంతో వినియోగదారులకు ఎంఎస్‌ఓలకు తమ వ్యతిరేకతను తెలియజేస్తున్నారు.

ఏకపక్షంగా నిర్ణయం

రాజానగరం నుంచి కోరుకొండకు 12 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అదే రాజమహేంద్రరానికి 20 కిలోమీటర్లు వస్తుంది. ఇది వినియోగదారునికి ఏ విధంగా సౌలభ్యం అవుతుందో హెచ్‌పీ కంపెనీ ప్రతినిధులే చెప్పాలి. వినియోగదారుడిని పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది.

– పి.ఈశ్వరరావు, రాజానగరం

సమాచారం లేదు

వంట గ్యాస్ కనెక్షన్లకు సంబంధించి ఏజెన్సీల బదలాయింపుపై ముందుగా మాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. కంపెనీలే సొంతంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టున్నాయి. చాలామంది వినియోగదారులు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తాం.

– బాపిరాజు, ఎంఎస్‌ఓ, రాజానగరం

ఎంఎస్‌ఎంఈ సర్వే నిబంధనల ప్రకారం చేపట్టాలి

పెదపూడి: సూక్ష్మ చిన్నతరహా మధ్యస్త పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) సర్వే సచివాలయం అధికారులు నిబంధనల ప్రకారం చేపట్టాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలంయ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సూక్ష్మ చిన్న తరహా మధ్యస్త పరిశ్రమలు వ్యాపారలు ఎంత మేర జరుగుతున్నాయో దానికి సంబంధించి ఆర్థిక వివరాలు సేకరించాలన్నారు. ఆ సేకరించిన వివరాలను సర్వ గ్రామ పంచాయతీ యాప్‌లోని ఎంఎస్ ఎంఈ విభాగంలో నమోదు చేయాలన్నారు. సర్వే ఈ రోజు ప్రారంభించామని, ఫిబ్రవరి ఒకటో తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. సర్వేకు నోడల్ అధికారిగా మండలానికి తాను వ్యవహరిస్తానన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి, ఏఓ శ్రీనివాసు, సచివాలయం కార్యదర్శులు యార్ల ఉమామహేశ్వరరావు, మన్యం శ్రీనువాసు చౌదరి, బి.ప్రసన్నకుమార్, సుంకర స్వామినాయుడు, ఉష తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లకు దరఖాస్తు చేసుకోండి

రాజానగరం: ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ల కోసం డిసెంబర్ మొదటి వారంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. సమీపంలో గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలిసి అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ దరఖాస్తులు అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు జిరాక్స్‌లు, ఆరు మాసాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను జత చేయాలన్నారు.

అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

- క్రీడాకారులతో సందడిగా మారిన బిక్కవోలు ఉన్నత పాఠశాల
- తొలిసారి బిక్కవోలులో రాష్ట్ర స్థాయి పోటీలు

బిక్కవోలు: స్థానిక ఉన్నత పాఠశాల వద్ద 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా పళ్లా వీర ప్రభాకర్ వ్యవహరించారు. బిక్కవోలు ఎస్సై వాసంశెట్టి రవికుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. క్రీడా పతాకాన్ని ముఖ్య అతిథులు ఆవిష్కరించారు. అనంతరం 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారులచే గౌరవ వందనం చేశారు. జాతీయ, రాష్ట్ర క్రీడాకారులతో క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటమిలను స్వీకరించాలన్నారు. గతంలో కంటే మెరుగైన ఆటను పదర్శించి ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. క్రీడాలు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయి. క్రీడా వలన ఆరోగ్య, మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాని పొందవచ్చును అన్నారు. క్రీడా వలన ఉన్నత ఉద్యోగాలు వస్తాయని, చదువుతో ఆటలు అవసరం అని ప్రతి క్రీడాకారులు గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పళ్లా వీర ప్రభాకర్‌రావు మాట్లాడుతూ మన పాఠశాల 140 మంది రాష్ట్రంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు రావడం చాలా ఆనందం ఉంది. వచ్చిన క్రీడాకారులు అందరూ కలిసి క్రీడా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా బిక్కవోలు ఎంతో మంది బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు విశేష కృషి చేసిన కీర్తీ శేషులు మానకొండ వీరరాఘవరెడ్డి కొనియాడారు అనంతరం ఘన నివాళులు అర్పించారు. లీగ దశలో ఎనిమిది జట్టు విజయం ఎంపికచేశారు. గ్రూప్ ఏ నుంచి గుంటూరు, పశ్చిమ గోదావరి, గ్రూప్ బీ నుంచి విజయనగరం, తూర్పు గోదావరి, గ్రూప్ సీ నుంచి శ్రీకాకుళం, కర్నూలు, గ్రూప్ డీ నుంచి విశాఖ పట్నం,ప్రకాశం జిల్లాలు ఎంపికయ్యారు. క్వార్టర్‌లో శ్రీకాకుళంపై పశ్చిమ గోదావరి జిల్లా పోటీ పడగా శ్రీకాకుళం విజయం సాధించి సైమి ఫైనల్స్ అర్హత సాధించారు. అలాగే గుంటూరు పై కర్నూలు మధ్య జరిగిన పోటీలో గుంటూరు విజయం సాధించి సైమి ఫైనల్స్ అర్హత సాధించారు. వాతావరణ వర్షం రావడం కొంత సమయం ఆటకు అంతరాయం కలిగింది. మిగిలిన మ్యాచ్‌లు శనివారం కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలోని తూర్పు గోదావరి జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి స్వామి,జిల్లా డిఎస్‌ఓ శేషగిరి రావు, రాష్ట్ర అబ్జర్వర్ రజిన, జిల్లా పీడీ పీఈటీటి అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్,అనపర్తి జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి టీవీ రాఘవరెడ్డి, సింహాదిరావు, బంగారు రాజు, పీడీలు మానకొండ ధనరాజ్, అప్పారెడ్డి, దార్వంపూడి యువరాజారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జూవేద్, వీకేఆర్ తంబి, క్రీడాకారులు పాల్గొన్నారు.


బిక్కవోలులో క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్


రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు చర్యలు

రంగంపేట: వరిలో కాండం తొలుచు పురుగు నివారణకు ఆదిలోనే చర్యలు చేపట్టాలని శ్రీకాకుళం వ్యవసాయ కళాశాల నైరా విద్యార్థులు సూచించారు. రాజమహేంద్రవరం ఏరువాక కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రంగంపేటలో వరిలో కొనలు తుంచుట, కాండం తొలుచు పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు గుడ్లను వరి నారు కొనలపై పెడుతుందని, తరువాత ఆ గుడ్ల నుంచి కాండం తొలుచు పురుగు లార్వా కాండంలోకి ప్రవేశించి మొవ్వ తొలచి కుళ్లిపోయేలా చేస్తుందని వివరించారు. దీని వల్ల మొక్క వడలిపోయి చనిపోతుందన్నారు. అదే పిలక దశలో అయితే కంకి తాలుగింజలతో నిండిపోయి తెల్లకంకిగా కనిపిస్తుందన్నారు. పురుగు వచ్చిన తరువాత నివారణ చర్యలు తీసుకునే బదులు రాకముందే చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం వరినాట్లు వేసేటప్పుడు కొనలను తుంచి నాటుకుంటే సరిపోతుందని, 75 శాతం మేర పురుగులు నాట్ల దశలోనే నివారించుకోవచ్చన్నారు. అనంతరం నారు వేళ్లను క్లోరిపైరిఫాస్ 2.0 మిల్లీ లీటర్ ఒక లీటర్ నీటిలో కలిపిన ద్రావణంలో ముంచి ఎలా నాట్లు వేయాలో అనే విధానం కూడా రైతులకు స్వయంగా సూచించారు. దాళ్లలో వరినాట్లు దగ్గరగా నాటుకోవాలని అన్నారు. ఈ విధానాన్ని రైతులు వెంటనే అమలు చేయడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో నైరా విద్యార్థులు ఎస్. నాగమణి, చరిస్మా, సునీత, ఎర్రయమ్మ, సాయి శ్యామల, రైతులు పాల్గొన్నారు.


వరి నాట్లు వేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న నైరా విద్యార్థులు

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

- యాంటీ చైల్డ్ అబ్యూజ్ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

పెదపూడి: చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం యాంటీ చైల్డ్ అబ్యూజ్ కమిటీ ఏర్పాటు చేసిందని ఆ కమిటీ చైర్మన్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థినులకు పడాల చారిటిబుల్ ట్రస్ట్ వారి సహకారంతో చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సమాజం నుంచి చిన్న ఆడపిల్లలను లైంగికంగా హింసకు గురి చేసే శక్తులు, పరిస్థితులు పారద్రోలాలని అభిప్రాయపడ్డారు. చైల్డ్ అభ్యుజ్ రహిత జిల్లాగా కాకినాడ జిల్లాను మార్చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. దీనికి గాను ప్రతి మండలానికి యాంటి చైల్డ్ అభ్యుజ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కమిటీలో తాను చైర్మన్‌గా, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పోలీసు సభ్యులుగా త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1, 2, కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి నాగేంద్ర, జెస్సీ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

ఉపాధి పథకంలో కూలీల సంఖ్య పెంచాలి

సీతానగరం: మండలంలోని ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో ఎం.భారతి సూచించారు. స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పశువుల షెడ్డు నిర్మాణాలను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. వంద రోజుల పని దినాలను పూర్తి చేసిన కుటుంబాలలో పదో తరగతి, ఆపై చదువుకున్న యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారన్నారు. మూడు నెలల పాటు జరిగే ఈ శిక్షణలో నెలకు రూ.9 వేలు గౌరవ వేతనంగా అందిస్తారని వివరించారు. ఏపీవో కె.నాగేశ వేణి మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 800 మంది కూలీలు పనులకు వస్తున్నారని, రాబోవు రోజుల్లో వారి సంఖ్యను మరింతగా పెంచాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు ఎ.చక్రవర్తి, వి.వీరబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు మోహిద్దీన్, నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో భారతి

కోరుకొండ మండలంలో ఆధ్యాత్మిక శోభ

1,08,012 రుద్రాక్షలతో మహార్చన

మధురపూడి: గాడాలలోని మహాలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వీరేశ్వరస్వామికి 1,08,012 రుద్రాక్షల మహార్చన నిర్వహించారు. పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఏకముఖ పంచముఖ రుద్రాక్షలతో జరిపారు. ప్రజారోగ్యాన్ని కాంక్షిస్తూ, పాడి పంటలు వృద్ధి చెందాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం హోమం జరిగింది.

లక్ష బిల్వార్చన

బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త క్రొవ్విడి సత్రాజు ఆధ్వర్యంలో అర్చకుడు మానేపల్లి సుబ్బారావు మంత్రోచ్ఛారణ నడుమ ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భారీ అన్న సమారాధన జరిపారు. బూరుగుపూడి, గుమ్ములూరు, నిడిగట్ల, దోసకాయలపల్లి, కాపవరం, కోరుకొండ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ నాయకులు ఏవీఎస్ఎస్ మూర్తి, అడపా రామకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


గాడాలలో వీరేశ్వరస్వామికి 1,08,012 రుద్రాక్షల మహార్చన చేస్తున్న వెంకన్నబాబు

రైతుల ఫిర్యాదుపై విచారణ

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామానికి చెందిన రైతులు చేపల చెరువులో వ్యర్థాలు వేయడం వల్ల నీరు కలుషితమవుతోందని రైతులు ఫిర్యాదుపై తహసీల్దార్ కృష్ణ విచారణ చేశారు. శుక్రవారం ఆయన కొమరిపాలెం గ్రామంలోని రైతులుతో మాట్లాడారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గోగులమ్మ గుడి, సత్రచావిడి, మురిక కాలువ, శెట్టి బలిజపేట, పంటకాలువ ఆనుకుని ఉన్న చెరువులు ఎర్రకాలువ గట్టు సమీపంలోని చేపలు చెరువులులో చేపలకు ఆహారం చనిపోయిన కోళ్ల వ్యర్థాలను ప్రతిరోజు వేస్తున్నారన్నారు. వాహనాలు కాలవ రేవు వద్ద శుభ్రం చేయడంతో నీరు కలుషం అవుతుందన్నారు. అలాగే చెరువు నుంచి కుక్కలు మాంసంలను తినేందుకు తీసుకువచ్చి పంట చెనులో వేస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేసి నివేదిక అందిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, వీఆర్వో శివ తదితరులు పాల్గొన్నారు.


కొమరిపాలెంలో విచారణ చేస్తున్న తహసీల్దార్ కృష్ణ

నేటి నుంచి ఆధ్యాత్మిక విజయోత్సవం

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్ ఆర్ వేదిక వద్ద శనివారం నుంచి ఆధ్యాత్మిక విజయోత్సవ వేడుకలు జరుగుతాయని రాయవరం ట్రూత్ సంఘ సభ్యులు సప్పా శ్రీను తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విజయవాడ చెందిన ట్రూత్ స్పిరిట్యూవల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఆత్మ జ్ఞానప్రబోధకులు శ్రీ వివేకనంద వస్తున్నారని తెలిపారు. శనివారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ జరుగుతాయన్నారు.

కార్తిక వన సమారాధనలు ఐక్యతకు దోహదం


అనపర్తి కోర్టు ఆవరణలో ఉసిరిమొక్కను నాటుతున్న జడ్జి ప్రసన్న

పెదపూడి: కార్తిక వనసమారాధనలు ఐక్యతకు దోహదం చేస్తాయని రాజమహేంద్రవరం 6వ కోర్టు జడ్జి, అనపర్తి కోర్టు ఇన్‌చార్జి రెడ్డి ప్రసన్న అన్నారు. అనపర్తి కోర్టు వద్ద శుక్రవారం న్యాయ్యవాదులు కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఉసిరిచెట్టు వద్ద దామోదర పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ కార్తిక వన సమారాధనలు ఉల్లాసంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

పెదపూడి: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని తద్వారా సైబర్ నేరాలు నివారణ సాధ్యమవుతుందని అనపర్తి సీఐ వీఎల్ వీకె సుమంత్ అన్నారు. కొప్పవరం గ్రామంలో శుక్రవారం ప్రజలకు సైబర్‌నేరాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ ఓఎల్ఎక్స్, సోషల్ మీడియా, ఎంప్లాయిమెంట్, లోన్ యాప్, ఫేక్ పోలీసు, ఓటీపీ, ఏటీఎం, క్రెడిట్ కార్డు తదితర అంశాలపై ప్రజలకు ఫోన్ల ద్వారా, ఆన్‌లైన్‌లో చాటింగ్ చేసి మాటలు కలిపి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వీటిపై ప్రజలు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీను నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుమంత్

ఘనంగా మహారుద్రాభిషేకం


కొంకుదురులో శివస్తోత్ర పారాయణ చేస్తున్న మహిళలు

బిక్కవోలు: కొంకుదురు బుడితల మామిడి వద్ద కొలువైన ఉన్న బాలత్రిపుర సుందరి దేవి సమేత త్రిముఖలింగేశ్వరస్వామి ఆలయం వద్ద మహారుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం రాత్రి కార్తిక మాసం మాసశివరాత్రి సందర్భంగా అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సుమారు 3వేల మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు శివసోత్రం పారాయణ చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఆలయం కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.